క్లుప్తంగా

సంక్రాంతి సంబరాలు



విద్యార్థినులు వేస్తున్న రంగవల్లులను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ స్వప్నహైందవి

రాజాం సిటీ: సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకలు పండగలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.స్వప్నహైందవి అన్నారు. కళాశాల ప్రాంగణంలో ముందస్తు సంక్రాంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు సంప్రదాయ వస్త్రాలంకరణలో వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు రంగవల్లుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. యువత మన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాలని ఉపాధ్యాయులు సూచించారు.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న హరిబాబు

రాజాం: స్థానిక ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ కరణం హరిబాబు బుధవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో సమీక్షించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. ఆస్పత్రి సిబ్బందితో పాటు పలువురు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

వాసునాయుడుకు పరామర్శ

వంగర: వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా విభాగం జిల్లా కన్వీనర్ యలకల వాసునాయుడును రాజాం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తలే రాజేష్ బుధవారం పరామర్శించారు. ఇటీవల వాసునాయుడు అనారోగ్యానికి గురికావడంతో ఆయన స్వగ్రామం వంగర మండలం రుషింగి గ్రామానికి వెళ్లి పరామర్శించారు. వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట పార్టీ సోషల్‌మీడియా ప్రతినిధులున్నారు.

సమ్మెకు దూరంగా..



అంగన్‌వాడీ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

సంతకవిటి: తమ డిమాండ్లు నెరవేర్చాలని అంగన్‌వాడీ సిబ్బంది సమ్మెలో పాల్గొన్నా.. సంతకవిటి మండలం సోమన్నపేటకు చెందిన అంగన్‌వాడీ సిబ్బంది సమ్మెకు దూరం ఉన్నారు. ప్రతిరోజు విధులకు హాజరవుతూ లబ్ధిదారులకు సేవలందిస్తున్నారు. గ్రామానికి చెందిన కార్యకర్త డి.సత్యవతి, హెల్పర్ వై.హైమావతి ప్రతిరోజు అంగన్‌వాడీ కేంద్రాన్ని తెరిచి పిల్లలకు పౌష్టికాహారం వండిపెడుతున్నారని, అటెండెన్స్ ఫోటోలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.వి.రత్నం తెలిపారు.

ప్రారంభానికి సిద్ధం



హెల్త్ వెల్‌నెస్ సెంటర్ భవనం

తెర్లాం: మండలంలోని ఎం.ఆర్.అగ్రహారం సచివాలయం పరిధిలో రూ.17.50లక్షలతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్ భవనం ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు చేతులమీదుగా త్వరలోనే ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సచివాలయ వ్యవస్థ ప్రారంభమైనప్పటి నుంచి హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌కు సొంత భవనం లేకపోవడంతో ప్రస్తుతం గ్రామ సచివాలయంలోనే ఆరోగ్య సేవలు అందిస్తున్నారు.

రూ.68.20 లక్షలతో వాటర్ ట్యాంకు నిర్మాణం



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ చిన్నంనాయుడు

రాజాం: మండలంలో అంతకాపల్లి పంచాయతీ మొగిలివలస గ్రామంలో రూ.68.20 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న వాటర్ ట్యాంకు నిర్మాణ పనులకు స్థానిక సర్పంచ్ వాకముల్లు చిన్నంనాయుడు బుధవారం భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొగిలివలస, అంతకాపల్లి గ్రామాల్లోని 800 ఇళ్లకు తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేసేందుకు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు నిధులు కేటాయించినట్లు చెప్పారు. మొగిలివలస, అంతకాపల్లిలో రూ.52.80 లక్షలతో వాటర్ ట్యాంకు నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బౌరోతు కాంతారావు, వైస్ సర్పంచ్ లెంక అప్పలనాయుడు, లెంక గణనాథ, పెదలంక బాలకృష్ణ, లెంక సన్యాసినాయుడు, లెంక శ్రీనివాసరావు, లెంక వెంకటరమణ, శాసపు వెంకటరమణ, శెట్టి తవిటినాయుడు, లెంక దామోదరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ జగన్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సూర్యప్రభ పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

- ప్రారంభమైన మండల స్థాయి క్రీడా సంబరం
- ఉత్సాహంగా పాల్గొన్న క్రీడాకారులు



రామభద్రపురం: వాలీబాల్ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



తెర్లాం: విజయరాంపురంలో క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లు, జెర్సీలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ మధుసూదనరావు

‘ఆడుదాం ఆంధ్రా’ మండల స్థాయి క్రీడా సంబరాలు బొబ్బిలి, రాజాం నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. సచివాలయ స్థాయిలో నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు మండల స్థాయి పోటీల్లో తమ సత్తా చూపేందుకు ఉత్సాహంగా పాల్గొన్నారు. రామభద్రపురం ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన క్రీడా పోటీలను ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని, బాగా ఆడాలని ప్రోత్సహించారు. గ్రామీణ ప్రాంత యువతను క్రీడల్లో ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ‘ఆడుదాం ఆంధ్రా’ క్రీడా పోటీలను నిర్వహిస్తోందన్నారు. రాజాంలోని జీసీఎస్ఆర్ గ్రౌండ్‌లో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. సంతకవిటి మండల పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన క్రీడా పోటీలను జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు ప్రారంభించారు. కార్యక్రమాల్లో పలువురు ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సాక్షి బొబ్బిలి/రాజాం



బాడంగి: బాడంగి హైస్కూల్‌లో క్రికెట్ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే శంబంగి



తెర్లాం: క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ



బొబ్బిలి: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే శంబంగి



బొబ్బిలి: వాలీబాల్ క్రీడను ప్రారంభిస్తున్న ఎంపీపీ శంబంగి లక్ష్మీవేణుగోపాలనాయుడు



రాజాం సిటీ: క్రీడాకారులకు ఆల్ ది బెస్ట్ చెపుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్



రాజాం: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వైఎస్సార్‌సీపీ రాజాం అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు, తదితరులు



సంతకవిటి: రిలే టార్చ్‌ను వెలిగిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు



సంతకవిటి: గౌరవ వందనం సమర్పిస్తున్న క్రీడాకారులు

అట్టహాసంగా సంక్రాంతి క్రీడా సంబరాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



సాంస్కృతిక పోటీలను తిలకిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, శంబంగి వేణుగోపాలనాయుడు, తదితరులు

బాడంగి: మండలంలోని కోడూరు గ్రామంలో స్వర్ణ భారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర స్థాయి కోలాటం, సాంస్కృతిక పోటీలు బుధవారం అట్టహాసంగా జరిగాయి. సంక్రాంతి సంబరాల్లో భాగంగా గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ, దివంగత తెంటు భారతి ఆరో వర్ధంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ పోటీలను ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ప్రారంభించారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖరరావు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సూర్యనారాయణరావు, సాతానవలస పెదబాబు, బొబ్బిలి ఎంపీపీ ప్రతినిధి శంబంగి వేణుగోపాలనాయుడు, తదితరులు పాల్గొని కోలాటం, సాంస్కృతిక పోటీలను తిలకించారు. ఈ పోటీల్లో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి 30 కళా బృందాలు పాల్గొన్నాయి. విజేతలకు జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా భారతి భర్త తెంటు సత్యంనాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కోలాటం, జానపద కళలను ప్రోత్సహించేలా ఇటువంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కళాకారులను, వారిని ప్రోత్సహించిన తెంటు సత్యంనాయుడును ఎమ్మెల్యే అభినందించారు.

చకచకా పింఛన్ల పంపిణీ



రేగిడి: ఉప్పర్నాయుడువలసలో పింఛన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ కరణం గోవిందరావు



రాజాం: కస్పావీధిలో పింఛన్లు అందిస్తున్న సచివాలయ కన్వీనర్ వట్టం నీలకంఠం, వైఎస్సార్‌సీపీ నేతలు



రామభద్రపురం: సోంపురంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు

రేగిడి/రాజాం/రామభద్రపురం: బొబ్బిలి, రాజాం నియోజకవర్గంలో కొత్తగా మంజూరైన పింఛన్లను స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు బుధవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ప్రభుత్వం పింఛన్‌ను రూ.3 వేలు చేయడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అంబేడ్కర్ ఆశయాలు నెరవేరుద్దాం..



తెర్లాం: కూనాయవలసలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సర్పంచ్ విజయబాబు, తదితరులు



వంగర: రుషింగిలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీనివాసరావు, యువత



రాజాం: పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్

తెర్లాం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు యువత కృషి చేయాలని మండల సర్పంచ్‌ల సంఘం ప్రధాన కార్యదర్శి, కూనాయవలస సర్పంచ్ బోడెల విజయబాబు పిలుపునిచ్చారు. విజయవాడలో ఈ నెల 19న సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం, స్మృతి వనం ప్రారంభించనున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం సామాజిక సమతా సంకల్పం అనే కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం కూనాయవలసలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలను వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ భారీ విగ్రహంతో పాటు, ఆయన జ్ఞాపకాలను తెలియజేసేలా స్మృతి వనాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. సామాజిక సమతా సంకల్పం కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు సూర్యం, పంచాయతీ కార్యదర్శి ఎంఏ స్వామి, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

- వంగర: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు నెరవేర్చేందుకు ప్రతీ ఒక్కరూ కృషిచేయాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత యలకల శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని రుషింగిలో బుధవారం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సామాజిక సమతా సంకల్పం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో సంతకాలు సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దీప్తి, యలకల వాసునాయుడు, పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

రాజాం: ఈ నెల 19న విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహావిష్కరణ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషిచేస్తున్నారని అన్నారు. అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాజాం టౌన్ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, నాయకులు తోట తిరుమలరావు, బుద్దుడు మాస్టారు, తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో గోపూజ

మెంటాడ: మండల కేంద్రంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం గోపూజ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా గోపూజ మహోత్సవం నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు పీసపాటి కృష్ణమాచార్యులు తెలిపారు. ఈ నెల 11న ముడుపుల సేవ, 12న కూడార్పై, 14న గోదాదేవి కల్యాణం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

మద్యం షాపు సిబ్బందిపై కేసు

వంగర: మండలంలోని మడ్డువలస మద్యం షాపు నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న అదే గ్రామానికి చెందిన బూరాడ సురేష్‌ను రాజాం ఎస్ఈబీ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఎస్ఈబీ సీఐ బి.శ్రీధర్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ దాడుల్లో సురేష్ వద్ద 52 మద్యం సీసాలు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సురేష్‌తో పాటు అతనికి పరిమితికి మించి మద్యం సీసాలు విక్రయించిన షాపు సూపర్‌వైజర్ పోలిరెడ్డి హరికృష్ణ, సేల్స్‌మేన్స్ తివనాన గణేష్, చీరాపు చంద్రమౌళిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్ఈబీ ఎస్సై సాలాపు పిచ్చేశ్వరరావు తెలిపారు.

- మండలంలోని వీవీఆర్‌పేట గ్రామం వద్ద అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలం నారాయణపురం గ్రామానికి చెందిన సింగిరెడ్డి తిరుపతిరావు మద్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు హెచ్‌సీ రాములు తెలిపారు. అతని వద్ద 75 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

మళ్లీ జగనే సీఎం కావాలి



డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

తెర్లాం: ఆంధ్రప్రదేశ్‌కి సీఎం వైఎస్ జగన్ ఎందుకు అవసరమో పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ప్రతీ ఇంటికి వెళ్లి ప్రజలకు వివరించాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు, ఎంపీపీ ప్రతినిధి నర్సుపల్లి బాబ్జీరావు సూచించారు. నందబలగల గ్రామ సచివాలయంలో ‘వై ఏపీ నీడ్స్ జగన్’ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసిందన్నారు. కులం, మతం, పార్టీలు చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలంతా వైఎస్సార్‌సీపీకి మద్దతిచ్చి జగనన్నను సీఎంను చేయాలని కోరారు. అనంతరం గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. మాజీ ఎంపీపీ యర్రా రామినాయుడు, మాజీ సర్పంచ్ గుల్లిపల్లి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

‘జగనన్న ఆరోగ్య సురక్ష’తో నాణ్యమైన వైద్య సేవలు



రాజాం: బుచ్చింపేటలో ఆరోగ్య సురక్ష శిబిరంలో రోగులకు మందులు అందిస్తున్న డాక్టర్ తలే రాజేష్, శ్రీనివాసరావు, తదితరులు

రాజాం: గ్రామాల్లో నిర్వహిస్తున్న ‘జగనన్న ఆరోగ్య సురక్ష’ శిబిరాల్లో నాణ్యమైన వైద్య సేవలు ప్రజలకు అందుతున్నాయని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. పట్టణంలోని బుచ్చింపేట వార్డు సచివాలయం వద్ద బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. నిపుణులైన వైద్యులు గ్రామాల్లో పర్యటించి ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నారని, ప్రతి ఒక్కరూ ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, నల్లా శ్రీనివాసరావు తోట తిరుమలరావు, కోరాడ రామినాయుడు, పిట్టా జగదీష్, నమ్మి పార్వతీరావు, ముద్దాడ అప్పన్న, పిట్టా సూర్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ ఎంవీ నాగరాజు, డాక్టర్ అనూష, డాక్టర్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

- బొబ్బిలి: పట్టణ పరిధిలోని పాత బొబ్బిలిలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్-2ను మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు, మున్సిపల్ అధికారులు ప్రారంభించారు. పరిసర వార్డుల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు శిబిరానికి వచ్చి ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు.

ప్రజావేదికలో సామాజిక తనిఖీల వివరాలు వెల్లడి



రేగిడి: ప్రజావేదికలో వివరాలు వెల్లడిస్తున్న డీఆర్‌పీ

రేగిడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉపాధిహామీ పథకం పనులకు సంబంధించి సామాజిక తనిఖీలపై బుధవారం ప్రజావేదిక నిర్వహించారు. ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ బీవీవీ లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌పీ ఎస్.మాధవరావుతో పాటు డీఆర్పీలు సామాజిక తనిఖీల నివేదికల వివరాలు వెల్లడించారు. మండలంలోని 39 గ్రామ పంచాయతీల్లో 2022–23 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన 1,773 పనులకు సంబంధించి రూ.17.15 కోట్లు నిధుల వినియోగంపై 15 రోజుల పాటు ఆడిట్ నిర్వహించినట్లు చెప్పారు. ఉపాధిహామీ పథకంతో పాటు అనుబంధ శాఖల ద్వారా ఖర్చు చేసిన నిధులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ఆడిట్ చేసినట్లు తెలిపారు. మండలంలో పలు పంచాయతీల్లో మస్టర్ల నమోదులో తేడాలతో పాటు ఎవెన్యూ ప్లాంటేషన్ నిర్వహణలో లోటుపాట్లు గుర్తించినట్లు వెల్లడించారు. పంచాయతీరాజ్‌కు సంబంధించి బల్క్‌మిల్క్ కేంద్రాల నిర్మాణం నిమిత్తం అందించిన సిమ్మెంట్ బస్తాలను పలు పంచాయతీల్లో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సీసీరోడ్లుకు, మురుగుకాలువల నిర్మాణానికి వినియోగించినట్లు పలువురు తెలిపారన్నారు. పూర్తిస్థాయి నివేదికలను రూపొందించి జిల్లా ఉన్నతాధికారులకు అందించనున్నట్లు ఎస్ఆర్పీ వివరించారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి వి.వెంకటరమణ, రాజాం ఏపీడీ ఎం.శ్రీనివాసరావు, డ్వామా ఏఓ వెంకటనాయుడు, వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, మండల పరిషత్ ఏఓ నాగమణి, ఏపీఓ హరనాథరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

రాజాం సిటీ: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఈ నెల 11న సామాజిక తనిఖీల ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బాసూరి శంకరరావు బుధవారం తెలిపారు. మండలంలోని 21 పంచాయతీల్లో 2022–23 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధిహామి పనులు, కొత్త పింఛన్లు, పంచాయతీ రాజ్ పనుల వివరాలు వెల్లడించనున్నట్లు తెలిపారు.

యూటర్న్ తీసుకోవడం సరికాదు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాయిపల్లి రామారావు

మెంటాడ: టీడీపీలో ఇమడలేకపోతున్నాని చెప్పి ఈ నెల 8న మంత్రులు బొత్స సత్యనారాయణ, రాజన్నదొర సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన ఆండ్ర ఎంపీటీసీ పాంచజన్ని నరసియమ్మ టీడీపీ నాయకులకు భయపడి యూటర్న్ తీసుకోవడం సరికాదని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాయిపల్లి రామారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్‌మోహనరెడ్డి పాలన, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తనను ఎంతగానో ఆకర్షించాయని చెప్పి పార్టీలో చేరిన ఆమె కొద్ది గంటల్లోనే పార్టీని వీడటం సమంజసం కాదన్నారు. మండలంలోని 15 మంది ఎంపీటీసీలు ఉండగా, అందులో 10 మంది వైఎస్సార్‌సీపీకి చెందినవారేనని, కొత్తగా పార్టీలోకి ఎవ్వరు వచ్చినా ఒరిగేదేమీ లేదన్నారు. ఎంపీటీసీ నరసీయ్యమ్మ చెబితే గ్రామంలో పది ఓట్లు కూడా రావని, అటువంటి వారు వైఎస్సార్‌సీపీలో చేరినా, చేరకున్నా ఒక్కటేనన్నారు. సమావేశంలో ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ సారిక ఈశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకులు రెడ్డి రాజప్పలనాయుడు, సూర్రెడ్డి పైడపునాయుడు, నాయుడుబాబు, సిరిశెట్టి నారాయణరావు, తదితరులు ఉన్నారు.

ఇంటింటికీ అయోధ్య అక్షతలు



రేగిడి: వన్నలిలో అక్షతలు పంపిణీ చేస్తున్న స్వామీజీలు

రేగిడి: ఈ నెల 22న అయోధ్యలో శ్రీరామ మందిరం ప్రాణప్రతిష్ఠోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరాముని దివ్య అక్షతలను బుధవారం పంపిణీ చేశారు. వన్నలి, చాటాయవలస, వండానపేట తదితర గ్రామాల్లో విశ్వహిందూ పరిషత్, శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ స్వామీజీలు ఇంటింటికీ వెళ్లి అయోధ్య రాముని ఆలయ విశిష్టతను వివరించి, అక్షతలను అందించారు. వాటిని ఇంట్లో కలిపిన అక్షతలతో కలుపుకుని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎండల మల్లికార్జున స్వామి దేవాలయం వ్యవస్థాపక అధ్యక్షుడు శివస్వామి, సమరసత సేవా ఫౌండేషన్ మండల కన్వీనర్ రాజన్న పాల్గొన్నారు.

- సంతకవిటి: మండలంలోని కొండగూడేం గ్రామంలో అయోధ్య శ్రీరాముని దివ్య అక్షతలను బుధవారం ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ నెల 22న అయోధ్యలో శ్రీరాముని ఆలయం ప్రారంభోత్సవం సందర్భంగా శ్రీరాముడి పూజకు వినియోగించిన అక్షతలను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అక్కరపోతు సత్యనారాయణ, శ్రీరామ భజన బృందం సభ్యుల పాల్గొన్నారు.